క్లుప్తంగా

నేడు వైసీ పల్లె ఉప సర్పంచ్ ఎన్నిక

నందలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి సూచనలతో ఈ నెల 15వ తేదీన మండలంలోని ఎర్రచెర్లోపల్లి (వైసీ పల్లి) గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపీడీఓ మాట్లాడుతూ 15వ తేదీన ఉదయం 11 గంటలకు పంచాయతీ వార్డు సభ్యులు అందరూ వీలు కల్పించుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో తప్పక హాజరుకావాలని కోరారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం


సివిల్స్ ర్యాంకర్ శ్రీకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి

వీరబల్లి : మండల కేంద్రానికి చెందిన కొత్త వెంకటరెడ్డి మనుమడు, చెన్నూరు సుబ్బారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 151వ ర్యాంకును సాధించాడు. బుధవారం మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి సివిల్స్ ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో అటు దేశానికి ఇటు రాష్ట్రానికి విశేష సేవలు అందించాలని శ్రీకాంత్ రెడ్డిని ఎంపీపీ కోరారు.

హాకీ స్టిక్కులు పంపిణీ



రాయచోటి జగదాంబ సెంటర్ : అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హాకీ స్టిక్కులను దాతల సహకారంతో పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావు, హాకీ ఫౌండర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ క్యాంపులో దాదాపు 70 మంది బాల బాలికలు కోచింగ్‌కు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో దాత సతీష్‌కుమార్, హాకీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బోనాలు సమర్పణ


బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

సుండుపల్లె : మండలంలోని బలిజపల్లి, పోచంవాండ్లపల్లి సమీపంలో వెలసిన కొత్తపురమ్మకు బుధవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం బలిజపల్లి గ్రామస్తులు బలిజపల్లి సమీపంలో వెలసిన అమ్మవారికి బోనాలు సమర్పించి విందు ఏర్పాటు చేసుకున్నారు. అలాగే పోచంవాండ్లపల్లె సమీపంలో వెలసిన కొత్తపురమ్మకు ఆ గ్రామస్తులు బోనాలను సమర్పించి బంధుమిత్రులకు విందు ఏర్పాటు చేశారు. సంబేపల్లి మండలం దుద్యాల గ్రామంలో బుధవారం నుంచి కొత్తపురమ్మ జాతర సందర్భంగా ఈ రెండు గ్రామాల సమీపంలో ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలియజేశారు.

పేదల సమస్యల పరిష్కారానికి పోరాటాలు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పేదల సమస్యలపై పోరాటాలు చేసి వారికి న్యాయం చేస్తామని బుధవారం ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. కోడూరు మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం తహసీల్దార్ మెహబూబ్ చాంద్‌కు వినతిపత్రం అందించారు. పథకాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం, గ్రామాల్లోని పేదలకు వ్యవసాయ భూమిని అందించాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జయచంద్ర ఆధ్వర్యంలో 100 మంది పార్టీలో చేరినట్లు తెలిపారు.

ఉచిత ఆరోగ్య శిబిరం

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని తాడిగొట్ల గ్రామంలో బుధవారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లావణ్య అధ్యక్షతన, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఒసామాలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఆలయాల అభివృద్ధికి అనాడే అడుగులు

- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆధ్యాత్మికత పెంపునకు చర్యలు
- కూటమి అధికారంలోకి వచ్చాక మందకొడిగా పనులు
- పనులు త్వరితగతిన పూర్తి చేయాలంటున్న భక్తులు


కొనసాగుతున్న మండెం నారసింహుని ఆలయ పునరుద్ధరణ పనులు

చిన్నమండెం : ఆధ్యాత్మిక చింతన పెంచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తి భావం పెంపొందించడమే ధ్యేయంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అడుగులు వేశారు. ఆయన వేసిన ఆధ్యాత్మిక అడుగులు ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. ఆలయాల నిర్మాణంతో పాటు ఆలయాలకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. మరుగునపడిన ఆలయాలను సైతం పూర్వ కళను సంతరించుకునేలా గత ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టింది. చిన్నమండెం మండలంలోని మండెం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, సంబేపల్లె మండలంలోని దేవపట్లమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకోగా, ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దేవదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయింపజేసి, పనులు ప్రారంభమయ్యేలా చూశారు. అలానే చిన్నమండెం మండలం మల్లూరు గ్రామంలో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న మల్లూరమ్మ ఆలయం ఇటీవల జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కాగా కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన ఆలయాల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆలయ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో చిన్నమండెం మండలంలో మంజూరైన ఆలయాలు.. సీజీఎఫ్ నిధులతో..

- దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లె సమీపంలో పురాతన చరిత్ర కలిగిన మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి శ్రీకాంత్‌రెడ్డి కృషితో రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. ముమ్మరంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- రూ.98 లక్షల నిధులతో మల్లూరమ్మ ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేశారు.
- మల్లూరు కొత్తపల్లెలో రూ.50 లక్షలతో కోదండ రామాలయ అభివృద్ధి పనులు జరిగాయి.

శ్రీవాణి ట్రస్ట్ ద్వారా..

- ఎగువ గడ్డ హరిజనవాడలో శ్రీ కోదండ రామాలయం
- కొత్తపల్లె ఎస్సీ కాలనీలో మాతమ్మ ఆలయాలు మంజూరయ్యాయి.
- దిగువగొట్టివీడు గ్రామం జంగంపల్లె శివాలయం రూ.5 లక్షల నిధులను శ్రీకాంత్‌రెడ్డి మంజూరు చేయించారు.

రాయచోటి రూరల్ మండలంలో..

- బొట్లచెరువులోని చౌడేశ్వరీ ఆలయ నిర్మాణానికి రూ.90 లక్షలు
- యండపల్లె గ్రామంలోని భైరవస్వామి ఆలయానికి రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం, 19.56 ఎకరాల భూములు అన్యాక్రాంతం కాకుండా దేవదాయ శాఖలోకి స్వాధీనం చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విశేషంగా కృషి చేశారు.

శ్రీవాణి ట్రస్ట్ టీటీడీ ద్వారా..

- గొర్లముదివీడు గ్రామం చెర్లోపల్లె రామాలయం
- డి.అబ్బవరం కమ్మపల్లెలో ఆంజనేయస్వామి ఆలయం
- పెమ్మాడపల్లె గ్రామం చిన్నవడ్డెపల్లె బీసీ కాలనీలో గంగమ్మ ఆలయం
- మొరవకాడపల్లె (గరుగుపల్లె)లో గంగమ్మ ఆలయం
- శెట్టివాండ్లపల్లెలో రామాలయాలు మంజూరయ్యాయి.


అభివృద్ధికి నోచుకున్న మల్లూరమ్మ ఆలయం

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరపాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాయచోటి టౌన్ : జమ్మూకశ్మీర్ రాష్ట్రం పెహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం తీవ్రంగా ఖండించడమే కాక కేంద్ర ప్రభుత్వం తీసుకుబోయే చర్యలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేసిందని పీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ అల్లాబకాష్ పేర్కొన్నారు. బుధవారం పాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు పెహల్గామ్ దాడిలో దాడికి పాల్పడిన తీవ్రవాదులను కేంద్రం గుర్తించడంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. దాడితో సంబంధం ఉన్న ఉగ్రవాదుల వివరాలను తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెహల్గామ్‌లో ఉగ్రదాడి తదుపరి జరిగిన సంఘటనలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి దేశ ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని పేర్కొన్నారు. లేదంటే కేంద్రం వైఖరిని ప్రజల్లో ఎండగడతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల ఆగడాలకు అంతేలేదు


సీపీఐ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

పెనగలూరు : మండలంలో కూటమి నాయకుల ఆగడాలకు అంతేలేకుండా పోతోందని సీపీఐ సహాయ కార్యదర్శి పి.మహేష్ తెలిపారు. మండలంలోని కుమ్మలకుంట గ్రామంలో సీపీఐ శాఖా మహాసభను గానిగిపెంట సుబ్రమణ్యం ఈ మహాసభకు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కూటమి పెద్దల అండదండలతో కూటమి నాయకులు యథేచ్ఛగా భూకబ్జాలు, ఇసుక దందాలు, మట్టి మాఫియాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాలను సీపీఐ ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంటి పట్టాల విషయంలో బడా నాయకులకు తొత్తులుగా ఉన్న వారికి మాత్రమే ఇంటిస్థలాలను కేటాయించి పేదవారికి వాగులు, వంకలు, చెరువులు, గుట్టలు ప్రాంతాలలో ఇంటి స్థలాలను మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లబ్ధిదారులకు ఇంటిస్థలాలు ఒకే చోట కేటాయించాలన్నారు. అలాగే ప్రతి పేద కుటుంబానికి బంజరు భూమి రెండు ఎకరాలు ఇవ్వాలని లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. అంతకుముందు కార్యకర్తలతో కలసి సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి గానిగిపెంట ఆదినారాయణ, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న అల్లరి మూకలు


నూనెవారిపల్లెలో పరస్పర దాడులకు దిగుతున్న యువకులు

రాజంపేట : పట్టణంలోని నూనెవారిపల్లి రోడ్డులోని రాజు స్కూల్ వెనుక వైపు ఉన్న బహిరంగ ప్రదేశంలో యువకుల గొడవలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో యువకులు మద్యం సేవించడమే కాక దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న అధికారులు పట్టించుకోక పోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పాడుతున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

17న సాప్పాలమ్మ ఆలయ వార్షికోత్సవం


సాప్పాలమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని బి.ఎ ద్రగుడి గ్రామం కొండావాండ్లపల్లిలో ఈనెల 17వ తేదీ శనివారం శ్రీ సాప్పాలమ్మ దేవస్థానంలో అంగరంగ వైభవంగా 8వ వార్షికోత్సవ వేడుకలు జరుగనున్నట్లు కార్యనిర్వాహకులు బండ్రేవు వంశీయులు, గ్రామ ప్రజలు పేర్కొన్నారు. శనివారం ఉదయం 6 గంటలకు అమ్మవారు సుప్రభాత సేవ, మహాగణపతి పూజ, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు దేశవాళి ఎద్దులతో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు బండ్రేవు వంశస్తులు, రాత్రి శివసాయి స్టోన్ క్రషర్స్ వారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు బద్వేల్ చెన్నంపల్లి పెద్ద రమణయ్య బృందం వారిచే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర డ్రామా జరుగుతుందన్నారు. ఎడ్ల పందెంలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి బండ్రేవు వంశస్తులు రూ. 25116లు, ద్వితీయ బహుమతి రెడ్డయ్య, రాజారెడ్డి, శివయ్య, నరసయ్యలు రూ. 20116లు, తృతీయ బహుమతి సర్పంచ్ కేశవయ్య రూ. 15,116లు, నాల్గవ బహుమతి ఆదినారాయణ రూ. 10116లు, ఐదవ బహుమతి చిన్నయ్య రూ. 5116లు, ఆరవ బహుమతి రామయ్య, కృష్ణయ్యలు రూ. 4116లు, ఏడవ బహుమతి రూ. 3116లు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ముందుగా కమిటీ సభ్యులకు (90001 74836, 63022 18332)తెలియజేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

వందేళ్ల అనంతరం వేడుకగా గంగ జాతర


పూజలందుకుంటున్న గంగమ్మ

పెనగలూరు : మండలంలోని అత్తిగారిపల్లి దళితవాడలో గంగమ్మ తల్లి జాతర బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. బుధవారం గ్రామ సరిహద్దులలో నాలుగు మూలల టెంకాయలు కొట్టి గంగమ్మ తల్లికి స్వాగతం పలికారు. రాత్రికి గంగమ్మ తల్లి ఆసాదు కథ నిర్వహించారు. గత ఆదివారం గ్రామంలో చల్లపోసుకోగా, అనంతరం పోతునుబట్టి గంగమ్మ జాతరకు అంకుకార్పణ చేశారు. గురువారం ఉదయం తెల్లవారుజాము గ్రామ పొలిమేర నుంచి గంగమ్మతల్లిని ఊరేగింపుగా తీసుకురానున్నారు. మధ్యాహ్నం గ్రామం మొత్తం సహబంతి భోజనం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో ఇప్పుడున్న పెద్దల హయాంలో ఇంతవరకు గంగమ్మ తల్లి జాతర జరపలేదని, వారి పెద్దల కాలంలో ఎప్పుడో జరిగినట్లు తెలియజేస్తున్నారు. వంద సంవత్సరాల తర్వాత గంగమ్మ జాతర చేస్తుండటంతో గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బంధువులను పిలిపించుకోవడంతో ఊరంతా సందడి వాతావరణం నెలకొంది.

మాదకద్రవ్యాలతో అనర్థాలు

కడప ఎడ్యుకేషన్ : మాదకద్రవ్యాలతో వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ బంధాలు దెబ్బతినడంతోపాటు సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సైన్ అన్నారు. బుధవారం కడప ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యసనాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నయన కుమార్, హెడ్ కోఆర్డినేటర్ సెల్వకుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సుండుపల్లె : రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న ఎస్సీ అభ్యర్థులకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్వ్యూకి హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు, కులం, ఆదాయం, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, రెండు ఫోటోలతో హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

వైభవంగా రేణుకా ఎల్లమాంబ కల్యాణం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా యల్లమాంబ కల్యాణం బుధవారం వైభవోపేతంగా జరిగింది. అమ్మవారి తిరునాల సందర్భంగా బుధవారం సాయంత్రం చెన్నూరు మండలం శేషన్నగారిపల్లె గ్రామానికి చెందిన అనుగోలు చిన్న ఎల్లయ్య కుమారులు అనుగోలు మల్లికార్జున, ఎల్లప్రసాద్‌ల ఆధ్వర్యంలో శ్రీ జగజ్జనని శ్రీ రేణుకా ఎల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, ప్రదీప్‌శర్మలు మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ క్రతువును జరిపారు. గ్రామ ప్రజలతో పాటు జిల్లా నలుమూల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

ముస్లిం సమాజానికి జకియాఖానం ద్రోహం


జాహిద్ అలీ


రాజంపేట రూరల్ : శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానం బీజేపీలో చేరి అటు వైఎస్సార్‌సీపీతో పాటు ఇటు ముస్లిం సమాజానికి తీరని ద్రోహం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి జాహిద్‌అలీ మండిపడ్డారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింల హృదయాలలో చిర స్థాయిగా నిలిచి పోయారన్నారు. ఆయన ఆశయాలను పుణికి పుచ్చుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అందలం ఎక్కించారని కొనియాడారు. ముస్లింలు అధికంగా ఉన్న రాయచోటి ప్రాంతం నుంచి జకియాఖానంకు ఎంఎల్‌సీ పదవి ఇచ్చి ముస్లింల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. నేడు ఆమె బీజేపీలో చేరి ముస్లిం సమాజానికి తీరని నష్టం కలిగించారని పేర్కొన్నారు.

లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

మదనపల్లె రూరల్ : కార్మికుల మెడకు ఉరితాళ్ల మాదిరిగా నిలిచిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు కృష్ణప్ప కోరారు. కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో రైతులు, కార్మికులు, గ్రామీణ ప్రజానీకం పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె విజయవంతంపై కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఘనంగా కొత్తపురమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచివున్న భక్తులు


అలంకరణలో కొత్తపురమ్మ


కొత్తపురమ్మకు శిద్దలకూడును సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

సంబేపల్లె : భక్తుల కొంగు బంగారమైన శ్రీ కొత్తపురమ్మ జాతర ప్రతి ఏటా మొలకల పౌర్ణమి తర్వాత రెండవ రోజు వైభవంగా నిర్వహించడం ఆనవాయతీ. ఈ క్రమంలోనే బుధవారం అమ్మవారి జాతర వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొత్తపురమ్మకు నైవేద్యంగా ప్రసాదం, గుమ్మడికాయ, అత్తిరాసాలు, 101 రూకలతో శిద్దల కూడును సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. రాత్రి అమ్మవారి ఊరేగింపుతోపాటు భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేకే కుట్రలు

రాయచోటి టౌన్ : పెద్దిరెడ్డి కుటుంబంపై సీఎం చంద్రబాబు నాయుడు రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు కేసులు బనాయించి ఇబ్బంది పెట్టాలని కుట్రలు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. బుధవారం రాయచోటి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కౌన్సిలర్ ఈశ్వర్‌ప్రసాద్, అనిల్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై సీఎం చంద్రబాబు నాయుడు పన్నిన కుట్రలో పవన్ కల్యాణ్ పావుగా మారుతున్నాడన్నారు. చంద్రబాబు ఆలోచనలను పాటిస్తున్న పవన్ కల్యాణ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదిని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూమిపై తప్పుడు కేసులు పెట్టడం వక్రబుద్ధి బయటపెట్టిందన్నారు. అలాగే పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణ తగ్గించేందుకు లిక్కర్ స్కాం పేరుతో కుట్రలకు పాల్పడటమే కాక ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పేరును జత చేయడం చంద్రబాబు విష రాజకీయమన్నారు. చంద్రబాబు కుటిల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గట్టి సమాధానం చెబుతారని తెలియజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం


వసతి గృహాల్లో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

సిద్దవటం : మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిద్దవటంలో బాల, బాలికల వసతి గృహాలలో బుధవారం దోమల నివారణకు ఏసీఎం కెమికల్ 5 శాతంను స్ప్రేయింగ్ చేయించామని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా ఉండటానికి స్ప్రేయింగ్ చేయించామన్నారు. దోమల వల్ల వ్యాప్తి చెందే రోగాలు రాకుండా ఉండటానికి ముందు జాగ్రత్తగా వసతి గృహంలో స్ప్రేయింగ్ చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో అన్ని గదులతోపాటు వంట గది, బాత్‌రూమ్స్, టాయిలెట్‌లలో స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. వసతి గృహంలోని వాటర్ ట్యాంక్‌ని పరిశీలించి ఎన్నిరోజులకు ట్యాంకు శుభ్రం చేస్తారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మౌలాలి, పద్మావతి, ఆరోగ్య కార్యకర్త శారద, ఆశ వర్కర్‌లు ఓబులమ్మ విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి పొందవచ్చని మాస్టర్ ట్రైనర్ ఎ.అన్నపూర్ణమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నరవకాటిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై దండోరా వేయిస్తూ, పోస్టర్లు అంటించి, కరపత్రాలు పంచుతూ అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీఎండీఎస్ ఉపయోగాలను, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను, రైతులకు అధిక ఆదాయం వచ్చే ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ గురించి తెలియజేశారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్న రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఏలు మనోహరరాజు, రామచంద్రయ్య, మోడల్ మేకర్ జనార్దన్, ఐసీఆర్‌పీఎస్‌లు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బ్యాంకు చైర్మన్‌ను భారతీయ మజ్దూర్ సంఘ్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు పత్రికాపరంగా చైర్మన్‌కు విన్నవించారు. కంప్యూటర్ ఇంక్రిమెంట్ అరియర్స్ విషయంలో నాడు ఏపీజీబీ ఉద్యోగులకు జరిగిన అన్యాయం గురించి గతంలో పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం కొంతమంది రిటైర్స్ నుంచి అరియర్స్ ఎక్కువ ఇచ్చామని రికవరీ పెట్టారని, మరి తక్కువ ఇచ్చిన వాళ్ల సంగతి ఏమిటన్నారు. ఒకే బ్యాచ్‌లో చేరి ఒకేసారి ప్రమోషన్ పొందినపుడు అరియర్స్‌లో ఎందుకు తేడా వచ్చాయన్నారు. సీజీజీబీలో 1993 నవంబరు 1 నుంచి కంప్యూటర్ ఇంక్రిమెంట్ ఉన్నదని, అప్పటి పర్సనల్ డిపార్టుమెంటు స్టాఫ్‌తో బ్యాంకు స్టాఫ్ అరియర్స్ లెక్క తేల్చి న్యాయం చేయాలన్నారు.